# 42

# చివరి నిమిషములోని సిద్ధపాటులు

## (16:21-28)

ఆయనే మెస్సీయాయనియు, ఆయన దేవుని కుమారుడై యున్నాడనియు యేసు వారితో చెప్పినప్పుడు ఆ మాటల అర్థమేమైయుండిందో శిష్యులు యింకా గ్రహించలేదు. అట్లయినను ఆయన మరణించవలసి యున్నదను యింకా ఎక్కువ ముఖ్యమైన విషయాన్ని యేసు ఇప్పుడు వారికి బోధింపనారంభించాడు.

### సమీపించుచుండిన సిలువ మరియు పొంచియుండిన ఆయన మరణము గూర్చి యేసు చేసిన తొలి ప్రకటన (16:21-23)

**21అప్పటినుండి తాను యెరూషలేమునకు వెళ్లి పెద్దలచేతను ప్రధాన యాజకుల చేతను శాస్త్రులచేతను అనేక హింసలు పొంది, చంపబడి, మూడవదినమున లేచుట అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేయ మొదలుపెట్టగా 22పేతురు ఆయన చేయిపట్టుకొని- ప్రభువా, అది నీకు దూరమగుగాక, అది నీ కెన్నడును కలుగదని ఆయనను గద్దింపసాగెను.**
**23అయితే ఆయన పేతురు వైపు తిరిగి-సాతానా, నావెనుకకు పొమ్ము; నీవు నాకు అభ్యంతర కారణమైయున్నావు; నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు గాని దేవుని సంగతులను తలంపకయున్నావని పేతురుతో చెప్పెను.**

**వచనము 21. అప్పటినుండి** (4:17 చూడు) అను పదజాలము యేసు పరిచర్యలోని ఒక నూతన ఘట్టమును సూచించుచున్నది. ఆయన గలిలయ ప్రాంతములో చేయుచుండిన పరిచర్య అంతము కావచ్చినది. గనుక ఆయన తన సావధానమును యెరూషలేము వైపు మళ్లించుచుండెను (19:1 చూడు). గొల్గొతా ఛాయ ఆయన మీద పడచుండినది. ఆది కాండము 3:15 మొదలుకొని వ్రాయబడియున్న లేఖనములన్నియు ఈ నాటకీయమైన ఈ సంఘటననే సూచించుచుండినవి. ఆయన తన ముఖమును యెరూషలేము దిశగా మళ్లించాడు, గనుక ఇక ఇప్పుడు వెనుదిరిగే ప్రసక్తే లేదు. ఆయన రక్షణ సందేశమును లోకములోని నలుదిశలకు తీసికొని వెళ్లుదురని ఆయన ఆధారపడుచుండినవారు వారి ఆధ్యాత్మిక అవగాహనలో యింకను పరిపూర్ణముగా పరిపక్వత చెందలేదని యేసు ఎరిగియుండెను. ఆయన వారికి బోధింపవలసినవి యింకా ఎన్నో విషయాలుండినవి కాని ఈ భారీ కార్యభారమును సాధించుటకు సమయము చాలా కొద్దిగా ఉండినది.

**తాను యెరూషలేమునకు వెళ్లి ... అనేక హింసలు పొందుట, ... అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేయ మొదలు పెట్టెను.** 16:1లో, యేసు వారికి ఒక సూచక క్రియను "చూపవలెనని" (*epideiknumi*) పరిసయ్యులు మరియు శాస్త్రులు ఆయనను అడిగారు, కాని ఆయన వారికి ఏ సూచక క్రియయైనను చూపించలేదు. ఇచ్చట యేసు భవిష్యత్తులో

ఏమి సంభవించునో తన శిష్యులకు "తెలియజేయ" (*deiknumi*) మొదలుపెట్టాడు. వారు క్రీస్తుతో కలిగియుండిన సంబంధము వారు ప్రత్యేకార్హత గల ప్రత్యక్షతలు పొందుటకు దోహదపడినది (13:11).[1] "అగత్యము" (*dei*) అను క్రియా పదము దైవికమైన అవసరతను సూచించుచున్నది; యేసు శ్రమలనుభవించుట, అది దేవుని చిత్తమైయుండినది (26:39, 42; అపొస్తలుల కార్యములు 2:23).

ప్రభువు పొందనైయుండిన శ్రమలు **పెద్దలచేతను ప్రధాన యాజకులచేతను శాస్త్రులచేతను** పురికొల్పబడును. వారి జ్ఞానము మరియు అనుభవములుబట్టి గౌరవింపబడిన నాయకులుగా, వారు "పెద్దలు" అయియుండిరి. ధనిక స్వామ్యములో ఉండి పరిపాలక వర్గములో సభ్యులైయుండి, వారు "ప్రధాన యాజకులు" అయియుండిరి. వీరు సర్వసాధారణముగా సద్దూకయ్యులతో చేతులు కలుపుచుండిరి. విద్యనభ్యసించిన యూదా మత బోధకులు, "శాస్త్రులు" లేక "ధర్మశాస్త్రోపదేశకులు" (NIV) అయియుండిరి; వీరు విశిష్టముగా పరిసయ్యులైయుండిరి. ఈవ్విధమైన వర్ణన సన్హెడ్రిన్‌ను, అనగా యెరూషలేములోని యూదుల మహా సభను సూచించుచున్నది. యేసును గౌరవించుచు ఆరాధించుటకు మొట్టమొదటి వరుసలో ఉండవలసినవారే, ఆయనను శ్రమపెట్టి ఆయన హతమార్చబడవలెనని పిలుపు నిచ్చినవారైయుండిరి![2]

ఆయన **చంపబడునని** క్రీస్తు నిర్దిష్టముగా ప్రవచించాడు. ఇటువంటి మరణము గూర్చి ఆయన ఇదివరకే సూచనలిచ్చాడు (9:15; 12:39, 40; యోహాను 2:19; 3:14, 15; 6:51), కానీ ఇదే ఆయన మరణమును గూర్చిన సుస్పష్టమైన తొలి ప్రకటనయైయుండినది (17:22, 23; 20:17-19; 26:2 చూడు). "ఆయన ఈ మాట బహిరంగముగా చెప్పెనని" మార్కు సువార్తలో గల సమాంతర వాక్య భాగము సెలవిచ్చుచున్నది (మార్కు 8:32). 16:24ల దీని గూర్చిన ధ్వనింపు ఉన్నట్లు అగుపించుచున్నప్పటికిని, ఆయన ఏ విధముగా మరణించనై యుండెనో యేసు తన శిష్యులకు ఈ ప్రవచనములో విదితముగా విశదపర్చలేదు. సిలువవేయబడుట ద్వారా ఆయన మరణించునని, తరువాత ప్రవచనములో యేసు బయలుపర్చాడు (20:17-19). బహుశా శిష్యులు ఈ విషయమును పాత నిబంధనలోని ప్రవచనమునుబట్టి తెలిసికొని యుండవలసినది (కీర్తనలు 22:16-18; యెషయా 53:1-12).

ఆయన **మూడవ దినమున లేచుట అగత్యమని కూడ** యేసు వివరించాడు. దేవుడు "ఆయన ఆత్మను పాతాళములో విడిచిపెట్టడు, సరికదా ఆయన తన పరిశుద్ధుని కుళ్లుపట్టనీయడు" (అపొస్తలుల కార్యములు 2:27). "మూడవ దినమున"-ఇది "మూడు దినముల తరువాత" అను హెబ్రీ భాషాభివ్యక్తమునకు సమానమైయున్నది-క్రీస్తు లేచునను మాటలు లేఖనములు ఎటువంటి మార్పులేకుండా సుస్థిరముగా ఇచ్చుచున్న సాక్ష్యమై యున్నది.[3] ఆయన శ్రమలనుభవించునని యేసు ముందుగానే ఎరిగియుండిన విషయము, అనగా అనేక సందర్భములలో ఆయన తన శిష్యులకు బయలుపర్చిన విషయము, ఆయన సజీవుడుగా మరలా వారికి అగుపించినప్పుడు వారి విశ్వాసమును బలపర్చినది (లూకా 24:44-49; యోహాను 14:29; 16:1, 4, 33).

**వచనము 22.** యేసు, క్రీస్తైయియున్నాడని పేతురు పలికిన ఒప్పుకోలు దృష్ట్యా (16:16), తప్పక సంభవింపనై యుండిన యేసు మరణ వార్త దిగ్భ్రాంతిని కలుగజేయునదై

యుండినది. **పేతురు ఆయన చేయి పట్టుకొని ... ఆయనను గద్దింపసాగెను.** అయితే పేతురు చేపట్టిన చర్యలు అత్యంత అసాధారణమై యున్నవనునది స్పష్టమగుచున్నది. ఒక విద్యార్థియైనవాడు, వాని ఉపదేశకునినే సరిదిద్దు వాడుకకు అది బొత్తిగా వ్యతిరేకమైనదై యుండినది. సరికదా పేతురు యేసును "గద్దించుట" అంతకు మించిన విపరీతమైన విషయమై యుండినది.[4] **ప్రభువా, అది నీకు దూరమగుగాక, అది నీ కెన్నడును కలుగదని** పేతురు పట్టుబట్టి పలుకుచుండెను. మెస్సీయా శ్రమలనుభవించునను అభిప్రాయము మొదటి శతాబ్దము నాటి యూదుల ఆశలకు సూటిగా వ్యతిరేకమైనదై యుండినది (1 కొరింథీయులకు 1:23). మెస్సీయా, ఇశ్రాయేలును తన శత్రువుల బారినుండి విడిపించి, ఇశ్రాయేలు లోలోపలనే ఉన్న దుర్మార్గులకు తీర్పు తీర్చువలసినవాడై యుండెను. ఆయన తానే చంపుకొనడు.[5] ఆట్లయినప్పటికిని, ప్రభువు మరణమును నిరోధించగలడని పేతురు అనుకొనుట బుద్ధిహీనమై యుండినది.

**వచనము 23.** యేసు పేతురును గద్దించుట గూర్చి వ్రాయబడిన విషయములలో, **సాతానా, నా వెనుకకు పొమ్ము** అను గద్దింపు అత్యంత తీవ్రమైనదై యున్నది. అతడు అటుతరవాత చేసినట్లుగానే, క్రీస్తును ఎరుగనని ముమ్మారు బొంకినప్పుడు, సాతాను అతనిని "గోధుముల వలె జల్లించునట్లు" అతని హృదయములో ప్రవేశించుటకు పేతురు అనుమతించాడు (లూకా 22:31). యేసు "సిలువ శ్రమల నొందకుండానే కిరీటము సంపాదించుకొనవలెనని" వాడు ఆయనను శోధించగలుగునట్లు అపవాది పేతురును వాడుకొను చుండెను[6] (4:8-10పై గల వ్యాఖ్యానము చూడు). ఒకడు దేవుని చిత్తమునకు విరోధముగా ప్రవర్తించుచున్నప్పుడు, వాడు సాతాను పక్షమున నున్నాడని వాడే తెలిసికొనును-సరికదా, వాడు సాతాను పనులలో నిమగ్నమయ్యాడని కూడ వాడు తెలిసికొనును.[7]

17వ మరియు 23వ వచనముల మధ్య ఒక బలమైన తారతమ్యము స్పష్టముగా విదితమగుచన్నది. 17వ వచనంలో, యేసు, క్రీస్తైయియున్నాడని పేతురు పలికిన ఒప్పుకోలునుబట్టి పేతురుకు ఆ విషయము దేవుని చేతనే బయలుపర్చబడినదని చెప్పుచు, యేసు అతనిని ఆశీర్వదించాడు. అయితే 23వ వచనంలో, పేతురు యేసును గద్దించుట సాతాను చేత ప్రేరేపింపబడిన విషయముగా అగుపించుచున్నది.

"సాతానా, నా వెనుకకు పొమ్ము" అని యేసు పలికిన మాటలు "సాతానా, పొమ్ము" అని 4:10లో[6] వ్రాయబడియున్న మాటల వలెనే ఉన్నవి. ఏదిఏమైనా, యేసు అరణ్యములో అపవాది చేత శోధింపబడుచుండిన సందర్భములో పలికినప్పుడు సాతాను ఆయన యెదుట నుండి వెళ్లిపోవలసినదని చెప్పుచుండెను, అయితే పేతురు ఒక శిష్యుడుగా తన సరైన పాత్ర వహించవలెనని లేదా సిలువ వరకు ఆయనను వెంబడించవలెనని ఆతనితో చెప్పుచుండవచ్చునని యిచ్చటి మాటలు అర్థమిచుచున్నవి.[8]

అతని స్థానమునుబట్టి, పేతురు యేసునకు **ఒక అడ్డు బండయై** (అభ్యంతర కారణమై) యుండెను. "బండయై" యుండిన పేతురు, ఒక అడ్డుబండ అయ్యాడు. యేసు వెనుకకు వెళ్లినట్లయితే, ఆయన సిలువ మార్గములో వెళ్లుచుండగా అతడు ఆయనకు ఏ మాత్రమును ఒక అడ్డుబండయై యుండడు.

**నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు, గాని దేవుని సంగతులను తలంపక**

**యున్నావని** యేసు పేతురుతో చెప్పాడు. ఈ అపొస్తలుడు ఆధ్యాత్మిక దృష్టికోణంతో ఆలోచించుచుండలేదు, కానీ శరీరానుసారంగా తలంచుచుండెను. యేసు, మెస్సీయయై యున్నాడని అతడు ఒప్పుకొనినప్పటికిని, ఆ పాత్రకు గల అర్థమేమిటో అతని అవగాహన యేసు గ్రహింపునకు భిన్నమైనదై యుండెను. 17వ వచనంలో, "రక్తమాంసములకును" (మర్త్యుడైన మనిషి) మరియు "పరలోకమందున్న తండ్రికిని" మధ్య ఒక బలమైన తారతమ్యము ప్రదర్శింపబడినది. ఇచ్చట "దేవుని సంగతులకును" "మనుష్యుల సంగతులకును" మధ్యగల తారతమ్యము ప్రదర్శింపబడినది.

## యేసు శిష్యత్వపు మూల్యము గూర్చి చేసిన ఘోషణ (16:24-27)

**24అప్పుడు యేసు తన శిష్యులను చూచి-ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల,
తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను. 25తన
ప్రాణమును రక్షించుకొనగోరువాడు దాని పోగొట్టుకొనును; నా నిమిత్తము తన
ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును. 26ఒక మనుష్యుడు లోకమంతయు
సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము? ఒక
మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి యియ్యగలడు? 27మనుష్యకుమారుడు తన
తండ్రి మహిమగలవాడై తన దూతలతోకూడ రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని
క్రియలచొప్పున వానికి ఫలమిచ్చును.**

**వచనము 24.** వారు చేయవలసియుండిన త్యాగముల కొరకు వారిని సిద్ధపరచుటకుగాను, **యేసు** తన అపొస్తలులకు శిష్యత్వము యొక్క అసలైన అర్థమును బోధించాడు. ఒకడు నిజముగా యేసు క్రీస్తును వెంబడించుచున్నవాడై యుండుటకు, వాడు **తనను తాను ఉపేక్షించుకొనవలెను**. "ఉపేక్షించుకొనుట" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*aparneomai*) "సంబంధాలను సంపూర్తిగా తెంచుకొనుట" లేదా, "ఒకడు తనను తాను మరొకరి నుండి బొత్తిగా వేరుపర్చుకొనుట" అను అర్థమీయవచ్చును. ఆయనను ఎరుగనని పేతురు బొంకనై యుండిన విషయమును సూచించుటకు యేసు ఇదే పదమును అటుతరువాత ప్రయోగించాడు (26:34, 35, 75). "సంపూర్తి నిస్వార్థముతో ప్రవర్తించుట" అనునది *aparneomai* కి గల మరొక నిర్వచనమైయున్నది. జీవితములో మనము రెండు ఎంపికలు చేసికొనవచ్చునను వాస్తవమును ఈ పదము ప్రతిబింబించుచున్నది; మనము, మనలను మనము ఉపేక్షించుకొందాము లేదా, తనను తాను ఉపేక్షించుకొనవలెనని పిలుపు నిచ్చుచున్న క్రీస్తును ఉపేక్షించుదుము.[9]

ఇంకా, నిజమైన శిష్యులమైయుండుటకు, ఒకడు **తన సిలువనెత్తుకొని** (10:38 చూడు) యేసును వెంబడించవలెను. లూకా "ప్రతి దినము" అను మాటను అదనంగా చేర్చాడు (లూకా 9:23). యేసు రోజుల్లో, సిలువ ఒక కంఠహారములో గాని, ఒక జాకెట్టుపై గాని ధరింపబడుటకు ఉద్దేశింపబడిన ఒక ఆభరణమై యుండలేదు, కానీ అదొక చిత్రహింసా పద్ధతియైయుండినది. సిలువవేయబడుట ప్రాచీన ప్రపంచంలో అత్యంత బాధాకరమైన, అవమానకరమైన, మరియు బలవంతముగా భయపెట్టుచుండిన మరణ దండన రూపములలో ఒకటైయుండినది. ప్రజలు వారిపై తిరుగుబాటు చేయుటను నిరోధించుటకు

రోమా ప్రభుత్వ పాలకులు ఈ విధానమును ఒక నివారక సాధనముగా సార్థకముగా ప్రయోగించారు. వాడుక ప్రకారంగా, నేరస్థులు ఒక బరువైన అడ్డ దూలమును (*patibulum*) వారు సిలువవేయబడు స్థలమునకు మోసికొని వెళ్లుదురు (యోహాను 19:17).[10] ఈ నేరస్థులు అడ్డదూలము యొక్క భారమైన బరువును బరించుట మాత్రమే కాదు కానీ, దారిన పోయే దానయ్యలంతా కూతలు కూస్తు పలుకుచుండిన వెక్కిరింతల మాటలను సహితము సహింపవలసియుండెను.

వారు ఆయన నిమిత్తము శ్రమలు మరియు అవమానములు అనుభవించుటకును, అవసరమైతే తమ ప్రాణాలర్పించుటకైనను ఇష్టపడుచున్నవారై యుండవలెనని యేసు **తన శిష్యులతో** చెప్పుచుండెను. **నన్ను వెంబడింపవలెను** అను మాటలు సిలువపై మరణించుటకు యెరూషలేమునకు పయనమై వెళ్లుచుండిన యేసునే సూచించుచున్నవి. అతడు ఆయన వెనుకకు వెళ్లవలసినదని యేసు పేతురుతో చెప్పిన మాటలతో ఈ మాటల యాదృచ్ఛికముగా సరిపడవచ్చును.

స్పష్టముగా శిష్యులలో ఏ ఒక్కరైనను శ్రమలనుభవించాల్సిన అవసరంలేదని పేతురు అనుకొని యుండును. అతడెంత పొరపాటు పడ్డాడు కదా! అటుతరువాత, అతడు ఏ విధంగా–సిలువవేయబడుట ద్వారా (యోహాను 21:18, 19)–మరణించనైయుండెనో యేసు పేతురుతో చెప్పాడు. అతడు కూడ యేసు వలెనే సిలువవేయబడుటకు యోగ్యుడని తనను తాను ఎంచుకొనలేదు గనుక, అతనిని తలక్రిందులుగా సిలువవేయవలసినదని పేతురు కోరినట్లు సాంప్రదాయము చెప్పుచున్నది.[11] ఎట్టకేలకు వీరందరు శ్రమలనుభవించవలసినవారై యుండిరి.[12] యాకోబు మరియు యోహానుల తల్లి యేసు నొద్దకు వచ్చి, ఆయన రాజ్యములో తన కుమారులిద్దరిలో ఒకడు కుడివైపునను, మరొకడు ఎడమ వైపునను కూర్చుండ సెలవిమ్మని ఆయన నడిగినప్పుడు ఆయన తాను త్రాగబోవుచుండిన గిన్నెలోనిది వారు సహితము త్రాగవలసి యుండునని, అనగా శ్రమలనుభవించి మరణించుదురని భావించుచు, యేసు ప్రత్యుత్తరమిచ్చాడు (20:23). సాంప్రదాయము ప్రకారము, ఒక్కడు తప్ప మిగిలిన విశ్వసనీయమైనవారై యుండిన అపొస్తలులందరు హతసాక్షులుగా తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ మినహాయింపు యోహానుకు, అనగా దేశ బహిష్కరణ గావింపబడి చిత్రహింసలనుభవించిన వానికి వర్తించుచున్నది (ప్రకటన 1:9).

**వచనము 25.** సిలువను ఎత్తికొనుట అనగా క్రీస్తు కొరకు తన ప్రాణమును కోల్పోవుట యని అర్థము. **తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును; కాని నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనునని** యేసు వివరించాడు (10:39 చూడు).[13] ఒకని ప్రాణమును దక్కించుకొనుట అనగా, తన సొంతం కోసమే జీవించుటయని అర్థము. ఇటువంటి జీవిత విధానము నిత్య జీవమును కోల్పోవుటతో అంతమగును. ఇంకా ఎక్కువ నిర్దిష్టముగా చెప్పుకొన్నట్లయితే, రాబర్ట్ హెచ్. గుండ్రి గుర్తించినట్లు, "హింసలకు గురియగు భయమునుబట్టి శిష్యత్వమును తృణీకరించుట ద్వారా, ఒకడు తన భౌతిక ప్రాణమును దక్కించుకొని తత్ఫలితంగా నిత్య జీవమును కోల్పోవునట్లు చేయును."[14] ఈ వచనములో, "ప్రాణము" అను పదము ఈ లోకమునకు సంబంధించిన జీవితము లేదా నిత్య జీవమును సూచింపవచ్చును.[15] "నీవు దేనిని ఎంపిక చేసుకొందువు?" అని యేసు వారినడిగాడు, నేడు మనలను కూడ అడుగుచున్నాడు.

**వచనము 26.** ఆ తరువాత యేసు, **ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి యియ్యగలడు?** అని యేసు అడిగాడు. "ప్రాణము" (16:25) మరియు "ఆత్మ" అను మాటలు ఒకే గ్రీకు పదము (*psuchē*) నుండి ఉత్పన్నమగుచున్నవి. గ్రీకు భాషగాని, హీబ్రూ మరియు అరబీ భాషలు కలిసియున్న భాషల కుటుంబము గాని "ఆత్మ" మరియు "ప్రాణము"నకు మధ్యగల స్పష్టమైన బేధమును తెలియజెప్పుట లేదు, ఏలయనగా ప్రతి యొక్క భాషలో, ఒక్క మాట రెండు భావములను సూచించుచున్నది.[16] ఈ సందర్భములో "ఆత్మ" అనునది సామాన్యమైన అనువాదమై యుండినది.

ఒకడు ప్రపంచములోని సిరిసంపదలన్నిటిని కలిగియుండుట మాత్రమేగాక, వాటినే అంటిపెట్టుకొని యుండుట సహితము సాధ్యమౌతుందని అనుకొన్నప్పటికిని, వాడు వాని ప్రాణమును కోల్పోవుటవలన వానికేమైనా ప్రయోజనముంటుందా? ఉండదు, కదా. సమస్త భౌతిక సిరిసంపదలు తాత్కాలికమైనవే (6:19–21). లోకమంతటిని సంపాదించుకొని తన ఆత్మను కోల్పోవుట ఒకడు చేయగల అత్యంత మూర్ఖపు పెట్టుబడియై యుండును (19:16–22; లూకా 12:16–21; 16:19–31). ఆస్తిపాస్తులను కూడబెట్టుకొనవచ్చును, మరియు కోల్పోవచ్చును కానీ ప్రతి ఒక్కనికి ఒక్కటే ఆత్మ ఉన్నది, రెండు లేవు. పరలోకమందు ధనము కూర్చుకొనుట అనగా, ఆ ధనమును నిరంతరము కలిగియుందుమని అర్థము. ఒకడు వాని ఆత్మను పోగొట్టుకొనిన తరువాత వాడు దానిని "వినిమయము" (*antallagma*) చేయజాలడు లేదా, "మరలా వెనుకకు తీసికొన" (కొనుగోలుచేయ) జాలడు.

**వచనము 27.** ఒకడు తనను తాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తుకొని, ఆయనను వెంబడింపవలసిన అవసరతలోగల ఆశీర్వాద వివరణను యేసు కొనసాగించాడు: (ఏలయనగా; NASB) **మనుష్య కుమారుడు తన తండ్రి మహిమగలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు, అప్పుడాయన ఎవని క్రియలచొప్పున వానికి ఫలమిచ్చును.** ఆయన తెలియజెప్పుచుండిన దానికి గల హేతువులను చెప్పుచు యేసు, "ఏలయనగా" లేక "ఎందుకనగా," అని మూడవసారి చెప్పాడు. రాబోవుచున్న తీర్పు దృష్ట్యా ఒకడు తనను తాను ఉపేక్షించుకొనుచున్న జీవితమును జీవించవలెనని ఆయన యిచ్చట చెప్పుచున్నాడు. ప్రభువు "మహిమలో" ("రాచ వైభవముతో") వచ్చుచున్నాడు, గనుక "ఆయన దూతలు" ఆయనతో కూడ వచ్చెదరు (25:31; 1 థెస్సలొనీకయులకు 4:16; 2 థెస్సలొనీకయులకు 1:7, 8). యేసు క్రీస్తు రెండవ రాకడ, ఆయన మొదటి రాకడవలె ఉండదు. ఆయన తిరిగివచ్చినప్పుడు, ప్రతి ఒక్కరు ఆ విషయమును ఎరుగుదురు (ప్రకటన 1:7). మానవాళికి తీర్పు తీర్చుటకై ఆయన తిరిగి వచ్చుచున్నాడు. ప్రతి ఒక్కరు వాని వాని న్యాయమైన ఫలము పొందును. ఈ తీర్పు వాని వాని "క్రియలపై" ఆధారపడి యుండును (రోమీయులకు 2:5–7; 2 కొరింథీయులకు 5:10; 11:15; 1 పేతురు 1:17; ప్రకటన 2:23; 20:12, 13; 22:12). ఆ తీర్పు ఒకని మాటలపై కూడ ఆధారపడి యుండును (12:36, 37), సరికదా ఒకడు దాచబడి యున్నవని వాడనుకొను తన సొంత రహస్య విషయములు సహితము పరిగణలోనికి తీసుకొనబడును (ప్రసంగి 12:14). సమస్త తీర్పు క్రీస్తు మాటలపై ఆధారపడి యుండును (యోహాను 12:48).

### కొందరు రాజ్యము వచ్చుట చూచెదరని యేసు యిచ్చిన వాగ్దానము (16:28)

**[28]ఇక్కడ నిలిచియున్నవారిలో కొందరు, మనుష్యకుమారుడు తన రాజ్యముతో వచ్చుట చూచువరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని నెను.**

**వచనము 28. ఆయన రాజ్యము** "బలముతో వచ్చుట" (మార్కు 9:1) చూచువరకు వారిలో కొందరు ఇంకను సజీవులుగానే యుందురని యేసు తన అపొస్తలులకు వాగ్దానమిచ్చాడు. పెంతెకొస్తు దినాన రాజ్యము వచ్చుట తమ కళ్లారా చూచుటకు తనను తానే చంపుకొనిన యూదా తప్ప (అపొస్తలుల కార్యములు 1:15–2:4), మిగిలిన వారందరు సజీవులై యుండిరి. రాజ్యము (సంఘము) వ్యవస్థాపింపబడిన తరువాతి కొన్ని వర్షముల వరకు మిగిలిన పదనొకండు మంది శిష్యులు **మరణము రుచిచూడలేదు**. "మరణము రుచి చూచుట" అను పదజాలము మరణమును అనుభవించుట గూర్చిన ఒక నుడికారమై యుండినది (యోహాను 8:52; హెబ్రీయులకు 2:9). రాజ్యము ఇప్పుడు ఇచ్చటనే ఉన్నదని లేఖనములు సామాన్యముగా సెలవిచ్చుచున్నవి (1 కొరింథీయులకు 15:24–28; కొలొస్సయులకు 1:13; హెబ్రీయులకు 12:28, 29; ప్రకటన 1:9). "తన రాజ్యముతో వచ్చుట" అను పదజాలము ఖచ్చితంగా ఆయన ఒక రాజుగాను, క్రైస్తవ యుగమునకు ప్రభువుగాను తన పరిపాలనను ప్రారంభించునను అర్థమునిచ్చుచున్నది (అపొస్తలుల కార్యములు 2:33–36).[17]

28వ వచనమునకు ఇవ్వబడిన యితర అనువాదములు సహేతుకము కావు లేదా సాధ్యము కావు. (1) అది 17వ అధ్యాయములో గ్రంథస్థం చేయబడియున్న రూపాంతరమును సూచించుచున్నదని వాదోపవాదములు జరిగినవి. ఏదిఏమైనా, యేసు రూపాంతరము నొందిన సంఘటన, ఈ సంభాషణ జరిగిన ఆరు రోజుల తరువాతనే జరిగినది (మత్తయి 17:1). యిటువంటి సంఘటన, అది సంభవించి యుండునని ధ్వనింపునిచ్చుచున్న కాలానుక్రమములోనికి పొసగజాలదు. యేసు రూపాంతరము పొందిన సంఘటన, ఆయన రాజ్య స్థాపన ముద్రవేయలేదు, కాని దానికి బదులుగా రాజ్యము వచ్చినప్పుడు యేసు మరొక మారు ఆనందానుభూతి చెందనైయుండిన మహిమను అది వెల్లడిచేసినది (యోహాను 17:5).

(2) సరికదా, క్రీ.శ. 70 నాటి యెరూషలేము నాశనమును ఈ వచనము సూచించజాలదు. యెరూషలేము పతనమగుట దేవుని తీర్పుకు ఒక సాక్షాత్కారమై యుండినది గనుక, అది క్రీస్తు రాజ్యము వచ్చుటతో సమానము చేయబడజాలదు. క్రీస్తు రాజ్యము యెరూషలేము పతనమునకు అనేక సంవత్సరముల క్రితం వచ్చినది (కొలొస్సయులకు 1:13; ప్రకటన 1:6 చూడు).

(3) ఇంతేగాక, ఈ వచనము క్రీస్తు రెండవ రాకడతో సంబంధము కలిగియుండజాలదు. యేసు క్రీస్తు తిరిగి రెండవ సారి వచ్చు సంఘటన ఎప్పుడు సంభవించునో ఆయనకు తెలియదని యేసు సెలవిచ్చారు (మత్తయి 24:36; మార్కు 13:32), అయితే ఈ వచనములో ఆయన రాజ్యము తన అపొస్తలులు జీవించియున్నప్పుడే వచ్చునని చెప్పుచున్నాడు. సహస్ర వర్షముల పాలన గూర్చిన ప్రధాన సిద్ధాంతములకు పరస్పర విరుద్ధముగా, ఆయన తన రాజ్యమును వ్యవస్థాపించుటకు యేసు తిరిగి రాడు.

ఆయన ఆరోహణుడైన పిదప పెంతెకొస్తు దినాన తన రాజ్యమును వ్యవస్థాపించాడు.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### పోగొట్టుకొని మరలా పొందినది (16:24-27)

యేసు వినయము యొక్క విలువను వివరించాడు (మత్తయి 23:11; లూకా 14:11; 18:14). ఆయన, "నీ మనస్సంతటిని నిన్ను గూర్చిన ఆలోచనలకు దూరంచేసుకో, మరియు నిన్ను గూర్చిన ఆలోచనలను నీ మనస్సంతటికి దూరంచేసికో" అనే నియమం ప్రకారమైన ఆచరణాత్మకముగా సెలవిచ్చాడు.

మనము పోగొట్టుకొనవలసిన కొన్ని విషయాలేమిటి?

1. *స్వార్థము.* స్వార్థపరులు పరిపక్వత్వచెందినవారు కారు. ఒకడు తనను తాను ఉపేక్షించుకొనవలెనని యేసు ఉపదేశించాడు.

2. *ఆత్మాభిమానము.* ఆదాము మరియు హవ్వ వారే దేవుడై యుండ గోరుట ఏదెను తోటలోని అసలు సమస్యయై యుండినది. సమస్యంతా గర్వమే.

3. *ఆత్మచైతన్యము.* "నిన్ను నీవు తెలిసికో" అని లోకము మనకు నేర్పుచున్నది. "నీకునీవే యథార్థపరుడవై యుండుము" అని కొందరు బోధిస్తారు.

దీనికి తారతమ్యముగా స్వయమును గూర్చి మనము తెలిసికొని అనుసరించుటకు పరిశుద్ధ బైబిల్ మూడు సూత్రములు బోధించుచున్నది: మనలను మనము అర్పించుకొనుట, ఉపేక్షించుకొనుట, మరియు పోగొట్టుకొనుట.

### మనలను మనము పోగొట్టుకొనుట (16:25)

ఒకడు క్రీస్తు హేతువు నిమిత్తము అవసరమైతే తన ప్రాణమును సహితము అర్పించుటకు యిష్టపడవలసియుండగా, ఈ లోకములో ప్రభువు పనులు చేయుటలో ఒకడు తనను తాను పోగొట్టుకొనుట కూడ సిలువనెత్తుకొనుట అను మాటల అర్థమై ఉండును. ఈ చర్యలలో నశించినవారిని వెదుకుట, రక్షింపబడినవారు సుస్థిరముగా రక్షింపబడినవారుగానే నిలిచియుండునట్లు వారిని కాయుట, మరియు పడిపోయినవారిని పునర్ధరించుట మొ|| పనులు కలిసియుండునని అర్థము. "దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి యిబ్బందులలో పరామర్శించుటకు వారిని సందర్శించుచు" "ఇహలోక మాలిన్యము తనకంటకుండ తన్నుతాను కాపాడుకొనుట" ద్వారా "పవిత్రమును నిష్కళంకమునైన భక్తిని" ఆచరణాత్మకముగా అభ్యసించుటయని అర్థము (యాకోబు 1:27). ఇటువంటి సమర్పణా జీవితము జీవించుటవలన నిత్యజీవము కలుగును.

### రక్షింపబడవలెనని కోరుకొనుట (16:26)

మనకు సంభవించు విషయాలలో ఎప్పుడైనాగాని సంభవించుటకు అవకాశముగల అత్యంత విషాదాంతమైన విషయమేమిటి? అది, ఉద్యోగమును కోల్పోవుటయా? ప్రియులను కోల్పోవుటయా? ఆరోగ్యము పాడగుటయా? వాస్తవమునకు, అది వీటిలో ఏదియును కాదు. యేసు మత్తయి 16:26లో దీనికి తన సమాధానము నిచ్చుచున్నాడు. ఒకడు తన

సొంత ఆత్మను పోగొట్టుకొనుటయే ఎవరి జీవితములోనైనా ఎప్పుడైనా సంభవించు అత్యంత విషాదాంతమైన విషయమైయున్నది. ఏ ఒక్కడైనను నశించవలసిన అవసరం లేదు; సకల మానవులు రక్షింపబడునట్లు దేవుడు సకల సమకూర్పులను సమకూర్చియున్నాడు. ఎవరైనా ఒకరు నశించినట్లయితే, అందుకు బాధ్యులు వారే, దేవుడు ఎన్నటికిని నిందింపబడజాలడు (రోమీయులకు 2:1).

రక్షణకొరకు ఐహిక ఆస్తిపాస్తులుగాని, విద్యాభ్యాస అర్హతలుగాని, లేదా పేరు ప్రతిష్ఠలుగాని అవసరమేలేదు. ఒకడు రక్షణ సువార్తకు లోబడునట్లు వాడుచేయవలసినదెల్లా, వానికి రక్షణ అగత్యమైయున్నదని అంగీకరించుటకుగల నిజాయితీ మరియు దేవుడు సెలవిచ్చిన ఆజ్ఞల ప్రకారము చేయుటకుగల యిష్టముతో పాటు, దేవుని సంతోషపరచవలెనని కోరుకొనుటయే.

---

సూచనలు

[1]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 421. [2]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 654. [3]మత్తయి 12:40; 16:21; 17:23; 20:19; 26:61; 27:40, 63, 64; మార్కు 8:31; 9:31; 10:34; 14:58; 15:29; లూకా 9:22; 13:32; 18:33; 24:7, 21, 46; యోహాను 2:19; అపో 10:40; 1 కొరింథీ 15:4. [4]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed Clinton E Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 104. [5]Douglas R. A. Hare, *Matthew*, lnterpretation (Louisville: John Knox Press, 1993), 194. [6]Hendriksen, 655. [7]W. F. Albright and C. S. Mann, *Matthew,* The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1971), 200. [8]Hare, 194. [9]Jack P. Lewis, *A Commentary on the Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 41-42. [10]Plutarch *Moralia* 554B.

[11]పేతురు తన ప్రాణమును సమర్పణము గావించిన విషయమును ఆదిమ సాంప్రదాయము పేర్కొనుచున్నది, కానీ ఎవ్విధముగా మరణించాడో బయలుపర్చుట లేదు (*1 Clement* 5.4). ఆయన తలక్రిందులుగా సిలువవేయబడినాడని తరువాతి రికార్డులు తెలియజెప్పుచున్నవి (Eusebius *Ecclesiastical History* 3.1; *Acts of Peter* 37-39). ఈ సాంప్రదాయమునకు సంబంధించిన ఖచ్చితత్వము వివాదగ్రస్తమై యుండగా, ఒకరిని తలక్రిందులుగా సిలువవేయుట యను అభ్యాసము పూర్వోదాహరణ లేకుండా లేదు (Seneca *Consolation to Marcia* 20). [12]ఈ ప్రకటన యేసును అప్పగించిన యూదాను తప్ప, మిగిలినవారందరిని సూచించుచున్నది. [13]యూదుల రచనలలో గల ఇటువంటి ఆలోచనల కొరకు *1 Enoch* 108.10; *2 Baruch* 51.15, 16; Mishnah *Aboth* 4.17; Talmud *Tamid* 32a చూడు. [14]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 340. [15]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 148. [16]Lewis, *Matthew*, 42. [17]McGarvey, 149.